

# పాపం... పాపారావ్!


కిల్లాన మోహన్ బాబు
నారంశెట్టి ఉమామహేశ్వరరావు


ఆఫీసునుంచి ఇంటికి వస్తూనే వనజ మీద గ:(య్‌మన్నాడు పాపారావు. 'నీకు బుద్ధుందా?' అని సింపుల్‌గానే అయినా సమాధానం చెప్పుకోలేని ప్రశ్న వేశాడు. ఆమె సమాధానం చెప్పేలోపునే విసురుగా లోపలకు వెళ్ళిపోయాడు.

పా పా రా వు ఆర్టీఓ ఆఫీసులో గుమస్తాగా పని చేస్తున్నాడు. అతని సీటు కామధేనువు, కల్పవృక్షాల వంటి జాతికి చెందింది. ఇదేంటీ అవి ఇక్కడ ఉన్నాయి? దేవేంద్రుడితో వైరపడి పాపారావును ఆశ్రయించాయా? అని జుత్తు పీక్కోవలసిన పనిలేదు.

ఆలా పీక్కుంటే జుత్తే చేతికివస్తుంది కానీ సొల్యూషన్ రాదు. అయితే మరి వాటితో ఎందుకు పోల్చవలసి వచ్చింది? ఆ సీటు కనకవర్షం కురిపించగల మహిమ గలది! అతనికి నెలకు రెండు జీతాలు అందుతున్నట్టు ఫీలవుతున్నాడు కూడా! ఒక జీతం ప్రభుత్వం ఇస్తే... మరొకటి ప్రజలే... అదే, పని ఉన్న ప్రజలే ఇస్తుంటారు.

తన సీటుకి ఉన్న విలువ చూసి తనకీ విలువ పెంచేశాడు పాపారావు. తనలాంటి అందగాడికి. తనలాంటి ఉద్యోగం గల అందగాడికి, తనలాంటి రాబడిగల ఉద్యోగం గల అందగాడికి పిల్లనివ్వడమే అవతలివాడి అదృష్టమని పాపారావు బలంగా నమ్మేవాడు.

అందువల్ల ఓ పాతికవేలు కట్నం, ఘనంగా లాంఛనాలు జరిపితేనే పెళ్ళి చేసుకుంటానన్నాడు. పెళ్ళిచూపుల వేటలో అతని చూపుల గాలాన్ని లాక్కున్న వనజను పెళ్ళాడాడు. ఆఫీసులో ఎప్పుడైనా పని చేసేటప్పుడు తను చెప్పిన రేటులో కన్‌సెషన్ ఇచ్చాడేమో తెలియదు గానీ వనజను మాత్రం తను అనుకున్న రేటుకే చేసుకున్నాడు.

వనజ చాలా మంచి వ్యక్తి. భర్త రెండు జీతాలు తెచ్చుకోవడం చూసి అందంగా మందలించింది. "ఛీ ఎంగిలి కూడు తింటున్నారా?" అంది.

"అవును. తినక తప్పదు. తినకపోతేనే ప్రమాదం" నెమ్మదిగా జవాబిచ్చాడు పాపారావు.

వనజ మాత్రం తక్కువ తిందా? ఆమె అంతటితో ఊరుకోలేదు. లంచం అనేది ఎంతగా నైతికవిలువలను దిగజారుస్తుందో వివరించి, నేడు లంచాల వల్ల పనితనం ఎంతగా కుంటుపడిందో చెప్పింది. అంతా శ్రద్ధగా విన్నాడు పాపారావు.

ఆఖరున బాంబు పేల్చాడు.

"చూడు వనజా! నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. సంతకం ప్రక్కన 'ప్రాలు' చేర్చి కాగితం రాసిమ్మన్నా ఇస్తాను. కాదనను. కాని నేను చేస్తున్న ఈ ఉద్యోగం విలువ ఎంతో నీకు తెల్సా? తెలీదు కనుకే అలా మాట్లాడావు. పదిహేను వేలు, అక్షరాలా పదిహేను వేలోయ్! అంత సొమ్ము పెట్టుబడి పెట్టి ఇన్‌స్టాల్‌మెంట్లులో వచ్చే లంచం లాభాలను వదులుకోవడం మూర్ఖత్వం కాక మరేమవుతుంది?" అలా నచ్చజెప్పి ఆమె నోరు నొక్కేశాడు.

కాలం ముందుకు దొర్లుతోంది. పాపారావులాంటి వారికి స్వీటుగా ఉన్నట్లని పిస్తే, మరెందరికో కర్కోటవిషంలా అన్పిస్తుంది! అది సహజం!

ప్రతిరోజూ యధావిధిగా గడచిపోతున్నా ఒకరోజు మాత్రం మార్పు కల్గించింది పాపారావ్‌లో! ఆరోజు రాత్రి వనజ భర్తతో "మీరు ఇంత సొమ్ము సంపాదిస్తున్నారు కదా! మనకంటూ ఒక ఇల్లు కట్టిస్తే ఆ సొమ్ముకి సార్ధకత, మనకు స్థిరత్వం ఏర్పడుతుంది" అంది.

ఆ మాటలు అతడిపై బలంగా పని చేశాయో, లేక వనజ తన లంచాల వేటను ఇన్‌డైరక్ట్‌గా ప్రోత్సహిస్తుందన్న ఊహ సంతోషం కల్గించిందో కాని ఆ రోజునుండి మరింతగా విజృంభించాడు.

వేరొక ప్రక్క స్థలంకొని దానికి పునాదిరాళ్ళు వేయించాడు.

ఓ శుభోదయాన ఆ రోజు దినపత్రిక చూస్తూ ఎగిరి గంతేశాడు పాపారావు వనజ కాఫీ తీసుకుని వస్తూ భర్త ప్రవర్తనకు మొదట ఆశ్చర్యం తర్వాత భయం హోల్ సేల్‌గా పొంది "ఏమైందండీ మీకు" అడిగింది తను తెచ్చిన కాఫీ టేబిల్ మీద పెట్టి!

"నువ్వేమీ కంగారు పడిపోకు! నన్ను కంగారు పెట్టెయ్యకు! అటవీశాఖలో ఆఫీసరు పోస్టులు ఖాళీ ఉన్నాయట! సరిగ్గా నా క్వాలిఫికేషన్లే వాళ్ళకి కావాలి" అన్నాడు సంతోషంగా మళ్ళీ ఎగిరి గంతేయబోతూ!

ఈసారి అతని ప్రయత్నం ఫలించ లేదు. వనజ రెక్కపుచ్చుకుని ఆపేసింది.

"చాల్లెండి! మీ ఆశకు అంతూపంతూ లేదా? చక్కని ఉద్యోగం, రెండు జీతాలు వదిలేసి దేనికో ఆఫీసరు పోస్టుకి పోతారట" కోపంగా అందామె! ఆ ఉద్యోగం అతడికే వచ్చేసినట్టు!

"పిచ్చిమొహమా! నీకు చెప్పినా అర్థంకాదులే! చిల్లర దొంగతనాలు చేసినవాడు బ్యాంకు దోపిడీ చేసే స్థాయికి ఎదిగినట్టే అవుతుంది నాకా ఉద్యోగం వస్తే! మంచి ఆదాయం" అన్నాడు చంకలు గుద్దుకుంటూ.

"తర్వాత చంకలు గుద్దుదురు కానీ ముందు కాఫీ తాగండి. లేకపోతే చల్లారిందని నన్ను తిడతారు మళ్ళీ" ఆమె హెచ్చరికతో మొదటి పని ఆపి రెండోది చేశాడు.

* * *

పాపారావు అటవీశాఖలో ఆఫీసరు ఉద్యోగానికి ఇంటర్‌వ్యూకి వెళ్ళేంత వరకు నెగ్గుకొచ్చాడు. అదీ బాగానే చేశారు. 'తను ఆ ఉద్యోగానికి సెలక్టు అయితే ఒకటి రెండు రోజుల్లో' అర్డర్ వస్తుంది. దానికోసమే ఎదురు చూస్తు న్నాడు.

అరోజు ఆఫీసునుండి ఇంటికి వచ్చిన పాపారావుకి "ఏమండీ! మీకో రిజిస్టర్డ్ లెటర్ వచ్చింది. మీరు లేరని చెప్పాను! ఒకసారి పోస్టాఫీసుకి రమ్మని చెప్పాడు పోస్టుమాన్" అంది వనజ!

"ఎక్కడినుంచో తెలుసుకున్నావా?" ఆత్రుత, సంతోషం అతడి స్వరంలో!

"లేదండీ" అందామె!

అంతే. అతని కోపం తారాస్థాయికి చేరినట్లు "నీకు బుద్ధుందా?" అని సింపుల్‌గానే అయినా సమాధానం చెప్పుకోలేని ప్రశ్న వేసేసాడు.

అదీ సంగతి.

* * *

పాపారావుకి ఆ రాత్రి నిద్రే పట్ట లేదు. తను వచ్చిన వెంటనే శ్రీమతి ఈ వార్త చెప్పింది. అలాగే పోస్టాఫీసుకి వెళ్ళిపోదామనుకున్నాడు. కానీ పోస్టాఫీసులో వాళ్ళు ఆ టైంలో ఉండరని

తెలిసి మానేశాడు. ఇంతకీ ఆ లెటర్ ఎక్కడనుండి? తను వెళ్ళిన ఆ ఆఫీసరు పోస్టు ఇంటర్వ్యూలో కానీ సెలక్టు కాలేదు కదా! వాళ్ళు పంపిన అప్పాయింట్‌మెంట్ ఆర్డరే అయ్యుంటుంది!

ఆ రాత్రంతా అవే కలలు! తను ఆఫీసరయినట్టూ, జీపుల్లో అడవుల్లో సంచరిస్తూ ప్రకృతి సౌందర్యాన్ని ఆహ్వానిస్తూన్నట్టు, తను మంచి బంగళా కట్టిస్తున్నట్టూ... ఇలా ఎన్నో కలలు!

ఎన్ని కలలు కంటున్నా సందేహంగా ఉంది పాపారావుకి. నిజమైతే అంతకు మించిన సంతోషం ఉండదు! పది యుగాల తర్వాత తెల్లారినట్లు సుదీర్ఘంగా తెల్లవారింది ఆ రాత్రి.

పోస్టాఫీసులో ఉద్యోగులెవరూ రాక ముందే వెళ్ళి కూర్చున్నాడు పాపారావు. ఎట్టకేలకు ఎనిమిది గంటలకి పోస్టుమాన్ వచ్చి మరో అరగంట దాటాక తన కవరు తీసుకొచ్చి సంతకం పెట్టించి ఇచ్చాడు.

కవరు తీసుకుని ఫ్రమ్ అడ్రసు చూస్తే తనపై అధికార్లది! ప్రమోషనేమో! ఈసారి అతని ఆలోచన మారింది! ఆత్రుత పెరిగింది. మనిషి ఆశాజీవి కదా!

కవరు విప్పి చదివి క్షణకాలం స్థబ్దుడైపోయాడు. ఎందుకంటే- అందులో అతడూహించిన రెండూ లేవు! మరి?? 'లంచాలు విరివిగా తింటున్న మిమ్మల్ని ఎందుకు సస్పెండ్ చేయగూడదో వివరణ ఇవ్వండి' అని పై అధికారి రాసిన లెటర్ అది.

పాపం... పాపారావ్!

